# "ఎవరికెవరు"

మల్లాది వెంకట కృష్ణశాస్త్రి

రిక్షాలోంచి దిగుతున్న వాళ్ళిద్దర్నీ చూసింది, ముందు గదిలోనుంచుని రేక్‌లోని పుస్తకాలు సర్దుతున్న గీత.

గేటుముందు ఆగిన రిక్షాలోంచి దిగిన ఆమె సన్నగా, తెల్లగా ఉంది. చేతిలోని హేండ్‌బ్యాగ్ లోంచి చిన్న తెల్లకాగితంతీసి, గేటుకు కట్టిఉన్న బోర్డువంక చూసింది. ఎడ్రెసు వ్రాసుకువచ్చిఉంటారు ఆ కాగితంమీద అనుకుంది గీత. ఆమె పక్కనేఉన్న అతను పర్సుతెరచి, రిక్షావాడికి చిల్లర ఇచ్చి రిక్షాలోని సూట్‌కేస్ అందుకున్నాడు ఠీవిగా.

ఇద్దరూ గేట్ తీసుకుని లోపలికి వచ్చారు. ముందు గదిలోంచి వరండాలోకివెళ్ళింది గీత. వరండా గుమ్మంముందే నిలబడిచూస్తున్నారాజంట, కొద్దిగా... అనుమానంగా.

"సౌభాగ్యరావుగారిల్లు ఇదేకదండీ?" అడిగాడు అతను, కుడిచేతిలోని సూట్‌కేస్ ఎడంచేతిలోకి మార్చుకుంటూ, మర్యాద వుట్టిపడేలా.

భర్తకోసరం వచ్చారని గ్రహించింది గీత. వెంటనే వాళ్ళెవరోకూడ గ్రహించింది.

"అవును. రండి! స్నానంచేస్తున్నారు" అన్నది గీత, పక్కకు తప్పుకొని. ఇద్దరూ లోపలికివచ్చారు.

"మీపేరు భాస్కరం అనుకుంటాను" అడిగింది గీత, కొన్నక్షణాలు అతనివంక చూసి.

"అవును" చెప్పాడు భాస్కరం, పలుకరింపుగా నవ్వి.

"మీరిద్దరూ ఇవాళ వస్తారని చెప్పారువారు, కూర్చోండి. ఇప్పుడే వారికి చెప్పివస్తాను."

లోపలికి నడిచింది గీత. డోర్‌కర్టెన్ మూస్తూ చూసింది వాళ్ళవంక, ఇద్దరూ కూర్చున్నారు కుర్చీల్లో.

"ఏరోయ్ పూల్? ఎన్నాళ్ళకి?" చెయ్యిచాపాడు. పైజమా లాల్చీలలోవున్న సౌభాగ్యరావు సంతోషంగా. మిత్రుడినిచూసి.

"బాగా లావయ్యావే?" అన్నాడు భాస్కరం, సౌభాగ్యరావు చెయ్యి అందుకుంటూ.

"నీ ఉత్తరం ఇందాకే అందింది. స్నానంచేసి వద్దామనుకుంటున్నాను స్టేషనుకి. అయినా రెండు రోజులు ముందర రాసుకోరూ ఉత్తరం? సరిగ్గా ఆదివారం అందేలా ఎక్స్‌ప్రెస్ డెలివరీ రాస్తేఎలా?"

"స్టేషన్‌లో కనబడకపోతే ఉత్తరం అందిఉండదనుకున్నాను."

గీత ట్రేలో కాఫీకప్పులతో వచ్చింది. పరిచయాలయ్యాక అన్నాడు సౌభాగ్యరావు నవ్వుతూ, "వాడికి కాఫీ తక్కువఇయ్యి, రోజుకి ఆరుసార్లయినా తాగుతాడు కనీసం."

"ఇప్పుడు అన్నిసార్లుతాగడంలేదు వారు. తగ్గించేశారు" అన్నది భాస్కరం భార్య.

"ఇంట్లో ఒక్కసారే ఇస్తే నేనుమాత్రం ఏం చెయ్యను? తగ్గించకతప్పలేదు" అన్నాడు భాస్కరం.

"నామీదకి నెట్టకండి, కాఫీలో స్లోపాయిజన్ ఉందని చెబితే భయపడి మానేశారు."

"ఆ సంగతి నీ ద్వారా తెలుసుకోలేదు. పెళ్ళిచూపులకి వెళ్ళినప్పుడు మానాన్న నాకు కాఫీతప్ప మరే చెడ్డ అలవాట్లు లేవనిచెప్పేవారు. ఒకఅమ్మాయి చెప్పింది ఆసంగతి పెళ్ళిచూపుల్లో మాటవరసకి...

అఫ్‌కోర్స్, ఆ అమ్మాయిన్ని నేను పెళ్ళి చేసుకో లేదనుకో."

అంతవరకు భాస్కరాన్ని ఎక్కడచూశానాఅని ఆలోచనగా చూస్తున్న గీత తలఎత్తి మళ్ళీచూసింది భాస్కరంవంక, పరిశీలనగా. గుర్తుకి వచ్చింది, ఎక్కడచూసిందీ. ఆరోజు పెళ్ళిచూపుల్లో!

"అసలు ఇవాళ ఇంట్లో ఉంటారనుకోలేదు మీరు, ఆదివారం కాబట్టి ఎదయినా సినిమాకి వెళ్ళి ఉంటారనుకున్నాను" అన్నాడు భాస్కరం.

"నువ్వు వస్తున్నట్లు తెలియకపోతే తప్పకుండా ఎక్కడకయినా వెళ్లేవాళ్ళం. ఆదివారాలు ఇంట్లో ఉండం సాధారణంగా."

"గుడ్. ఉత్తరం వ్రాయడం మంచిదయిం దన్నమాట."

"మీరు మాపెళ్ళికి రాలేదు" అన్నది భాస్కరం భార్య.

"కేంప్‌లో ఉన్నాను మీపెళ్లి జరిగేటప్పుడు. కేంప్‌నుంచి తిరిగివచ్చి శుభలేఖ చూసేటప్పటికి మీపెళ్ళి అయిపోయింది. గీత టెలిగ్రాం ఇచ్చిందను కుంటాను మీకు, శుభాకాంక్షలు తెలుపుతూ."

వంటగదిలో బియ్యం కడుగుతూ ఆలోచిస్తోంది గీత. భాస్కరం తననిగుర్తుపట్టాడా? అసలు అతనూ భాస్కరం ఒక్కరేనా?

భోజనాల దగ్గర అడిగాడు సౌభాగ్యరావు, భాస్కరాన్ని "మీ అమ్మగార్ని తీసుకురాలేదే కూడా? ఆవిడకి తీర్థయాత్రలంటే ఇష్టంకదా?"

సమాధానం చెప్పలేదు భాస్కరం.

తలఎత్తి భాస్కరంవంక చూశాడు సౌభాగ్య రావు. కంచంలోకి చూస్తున్నాడు భాస్కరం. మళ్ళీ ఆప్రశ్న వెయ్యలేదు సౌభాగ్యరావు.

"బెండకాయ కూరంటే నాకింకేం అక్కర్లేదు అన్నంలోకి" అన్నాడు భాస్కరం కొన్ని క్షణాల తరవాత.

"నీకింకా గుర్తుందా?" అడిగాడు సౌభాగ్యరావు.

"ఏమిటి?"

"మనహోటల్లో సర్వర్‌కి నువు నెలకి నాలుగో, అయిదో ఇచ్చేవాడివి రహస్యంగా, అందరికన్నా ఎక్కువ వడ్డించేవాడు నీకుమాత్రం. అప్పడాలు నాలుగైదుదాకా వేసేవాడు."

"గుర్తుంది."

ఆడవాళ్ళిద్దరూ నవ్వారు.

పాతసంగతులు మాట్లాడుకుంటూ ఉండిపోయారు, భోజనాలయేదాకా.

భోజనాలయి విశ్రాంతి తీసుకుంటూండగా చెప్పాడు భాస్కరం.

"ఇందాక అన్నంముందు చెప్పబుద్ధికాలేదు... చచ్చిపోయింది అమ్మ."

"ఎప్పుడు?" సౌభాగ్యరావు అడిగాడు బాధగా.

"మూడేళ్ళు అవుతుంది."

"నాకు తెలియపరచలేదు నువ్వు."

"మనం ఉత్తరాలు రాసుకుంటేగా? నీ కొత్త ఎడ్రెసు రెండునెలల క్రితంవరకూ నాకు తెలియదు."

"పాపం. ఎలాజరిగింది?"

"ఫైలేరియా జ్వరంలో."

"ఫైలేరియా... అంటే బోదః"

"అవును."

గీతకి అయిదేళ్ళక్రితం తనుచూసిన భాస్కరం, ఈభాస్కరం ఒక్కడేనన్న సంగతి నిశ్చయమై పోయింది వెంటనే, పక్కగదిలో కార్నర్ టేబిల్ మీద ఉన్న ఫ్లవర్‌వాజ్‌ని తడిగుడ్డతో తుడుస్తున్న గీతకు వాళ్ళమాటలు వినబడుతున్నాయి.

"పాపం! మీఅమ్మ చాలమంచిది. నేను మీయిం టికి వచ్చినప్పుడల్లా ఆప్యాయంగా మాట్లాడేది. టిఫిన్ పెట్టకుండా పంపేదికాదు."

"చాలమంచిది అమ్మ నిజంగా. అయినా చావుకి మంచిచెడ్డలతో సంబంధంలేదు. కాలం తీరినవాళ్ళని

తీసుకుపోతుంది. మన ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా."

"అయిదేళ్ళుదాటుతోంది మనిద్దరంకలుసుకుని."

"అయిదున్నర"; మనసులోనే లెక్కవేసుకుని చెప్పాడు భాస్కరం సరిగ్గా.

"నాకు సెండాఫ్ ఇచ్చేందుకు స్టేషనుకివచ్చావు ఆరోజు. పెళ్ళిచూపులకి వెళ్ళావనిచెప్పావు గుర్తుందా అప్పుడు?" అడిగాడు సౌభాగ్యరావు కొన్ని నిమిషాల తర్వాత.

"అవును గుర్తుంది."

చిరునవ్వునవ్వాడు భాస్కరం.

"అప్పట్లో పెళ్ళిచేసుకోవడం ఇష్టంలేకపోయినా మీఅమ్మ బలవంతంమీద పెళ్ళిచూపులకి వెళ్ళావని, ఆపిల్ల నీకు నచ్చిందని చెప్పావు."

"అవును. దాదాపు సెటిల్ అయిపోయింది."

"ఆ అమ్మాయి పేరుకూడ ఏదోచెప్పావు గుర్తులేదు."

"నాక్కూడ గుర్తులేదు ఇప్పుడు."

"ముహూర్తం నిశ్చయం అవగానే వెడ్డింగ్‌కార్డ్ పంపుతానని చెప్పావు. చాలారోజులు ఎదురుచూశాను, పెళ్ళిపిలుపుకోసం, రాలేదు. ఆ అమ్మాయేనా..."

"కాదు. మా ఇద్దరికీ పెళ్ళికాలేదు."

"నేను ఊహించాను, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోలేదని. రెండుసంవత్సరాల క్రితమేగా నీనుంచి పెళ్ళిపిలుపు కార్డువచ్చింది. ఆ అమ్మాయిని ఎందుకు చేసుకోలేదు? కట్నందగ్గర పేచీవచ్చిందా?"

"కట్నంకాదు. చిన్న కారణంవల్ల మాపెళ్ళి తప్పిపోయింది."

"ఏమిటా కారణం?"

"చాలా చిన్నకారణం. సిల్లీ."

గీత ఫ్లవర్‌వాజ్ శుభ్రంగా తుడిచి, పువ్వులు వేజ్‌లో అమర్చి, కార్నర్ టేబుల్‌మీద తిరిగి పెట్టేసింది వేజ్‌ని.

"ఏమిటా కారణం?"

"చెప్పాలా?"

భాస్కరం అడిగాడు, సౌభాగ్యరావుని, పొడిగా.

"చెప్పు?"

"నువ్వువెళ్ళిన మూడోరోజుననుకుంటాను. ఆ పెళ్ళికూతురు తండ్రి మాయింటికొచ్చాడు-అన్నిసంగతులు మాట్లాడుకుని వీలయితే తాంబూలాలు పుచ్చుకునేందుకు. కాని విచిత్రం. మాఅమ్మతో రెండే రెండు నిమిషాలు మాట్లాడి, తిరిగి వెళ్ళి పోయాడు."

"దేనికి?"

చిన్నగానిట్టూర్చింది గీత, కిటికీలోంచి ఆకాశం వంక చూస్తూ.

"నాకూ అంతుపట్టలేదు. మళ్ళీ మాట్లాడడానికి వస్తారనుకున్నానుగానీ రాలేదు. తర్వాత మధ్యవర్తి ద్వారా కబురు పంపించారు, మా సంబంధం ఇష్టం లేదని."

"దేనికి ఇష్టంలేదట."

"ఏదో గుడ్డిసాకు చూపించారు."

"ఆ అమ్మాయికి నువు నచ్చలేదా?"

"పూర్తిగా నచ్చాను."

"మరి? అసలుకారణం ఏమిటి?"

"వారంరోజులతర్వాత నిలదీసిఅడిగితే ఆమధ్యవర్తి చెప్పాడు రహస్యంగా నాతో. అమ్మకి తెలియనివ్వద్దన్నాడు, బాధపడుతుందని" అని ఆగి, ఎదురుగా టేబిల్‌మీదఉన్న వెండిప్లేట్‌లోని వక్కపొడిని నోట్లోవేసుకుని అన్నాడు.

"నీకు తెలుసుగా—మా అమ్మకి బోదఉందని."

"అవును. అయితే?"

"ఆ అమ్మాయికి చిన్నప్పట్నుంచీ బోదఅంటే భయమట అసహ్యమట మాతాతయ్యకికూడ బోద ఉందన్నసంగతి తెలిసిందట వాళ్ళకి."

"మీ అమ్మ బోదకీ, నీపెళ్ళికీ సంబంధం ఏమిటి?" అడిగాడు సౌభాగ్యరావు.

"ఆరోజు తాంబూలాలు పుచ్చుకోడానికి మా ఇంటికి వచ్చినప్పుడు. మాఅమ్మ కుడికాలికి బోద ఉండటం గమనించాడట పెళ్ళికూతురు తండ్రి. ఆ సంగతి పెళ్ళికూతురికి చెప్పాడట ఇంటికివెళ్ళి."

సౌభాగ్యరావు వింటున్నాడు.

'మధ్యవర్తి చెప్పాడు. ఏమన్నదో తెలుసా? రేపు పెళ్ళయ్యాక ఆబోద నాకూ రావచ్చట. అకస్మాత్తుగా, వంశపారంపర్యంగా, తాతయ్యకీ, అమ్మకీ వచ్చినట్లుగా మాకు పుట్టబోయే సంతానానికి రావచ్చట తర్వాత.'

'బోద వంశపారంపర్యంగా వచ్చేవ్యాధి కాదనుకుంటాను'

'ఏమో? మా అమ్మకు జ్వరంవస్తే ఇంటికోడలు కాబట్టి, వేరే ఎవరూలేరు కాబట్టి, ఆ అమ్మాయే సపర్యలు చెయ్యాల్సి వస్తుందిట. అసలు పెళ్ళయితే అమ్మ నాతో ఉండటం ఇష్టంలేదుట. చుట్టపుచూపుగా ఎప్పుడయినా వస్తేకూడ అభ్యంతరమేమో'

"పెళ్ళయిన తరవాత ఆ సంగతి తెలిస్తే ఏం చేసేది?'

'అవకముందు తెలియడమే మంచిదయింది. లేకపోతే బాధపడేవాడ్ని. అమ్మ మనసు బాధపడేది'.

"ఫెంటాస్టిక్ అయినా అంత అసహ్యించుకోదగ్గ వ్యాధి కాదు బోద."

గీత కుర్చీలో కూర్చొంది. వినబడుతున్న వాళ్ల మాటలు వింటూ, మనసులో ఆలోచనలతో.

"దానికి నేనంటే ప్రాణం. మా పెళ్ళి అవకపోతే నాకు ఇది దక్కేది కాదు. కాఫీలో కెఫిన్ అనే స్లో పాయిజన్ ఉందని చిన్నప్పుడు చదువుకుందిట. అందుచేత పోట్లాడి బలవంతంగా నాచేత కాఫీ మాన్పించింది."

చెప్పుకు పోతున్నాడు భాస్కరం తన భార్య గురించి, ఉత్సాహంగా,

గీత పక్క వాళ్ళింటికి వెళ్ళిపోయింది.

సాయంత్రం గీత ఇంటి దగ్గరే ఉండిపోయింది. తలనొప్పిగా ఉందని, మిగతా ముగ్గురూ షికారుకి బయలుదేరారు.

'మీ ఫ్రెండ్ భార్యకి తగని సిగ్గు. నన్ను చూస్తేనే సిగ్గు పడుతుంది. నేనామె ఉన్న గదిలోకి వెళితే ఏదో వంకతో వెళ్ళిపోయింది రెండుసార్లు. సోషల్‌గా ఉండటం తెలియదు పాపం'. రహస్యంగా చెప్పింది భాస్కరంభార్య, భాస్కరానికి.

దాదాపు రెండు గంటల తర్వాత, చీకటి పడుతూండగా ముగ్గురూ తిరిగి వచ్చారు. గీత వంట ప్రయత్నంలో ఉంది అప్పటికే, వంటగదిలో.

భాస్కరం భార్య గీతకి వంటలో సహాయం చేయడానికి వంటగదిలోకి వెళ్ళిపోయింది. మొగవాళ్ళిద్దరూ ముందు గదిలో కూర్చుని మాట్లాడుకోసాగారు.

ఆఫీసు సంగతులూ, వాళ్ల చదువుకునే రోజుల్లోని సంగతులూ, రాజకీయాలు ఇంకా చాల సంగతులు దొర్లిపోయాయి వాళ్ళ మాటల్లో.

ఏడున్నరకి భోజనం సిద్ధం అయింది. ఎనిమిదిన్నరకల్లా భోజనం ముగించారు, గీత తప్ప మిగతా ముగ్గురూ, గీత వడ్డించింది అందరికీ.

'ప్రయాణం వాయిదా వేసుకోవడం కుదరదా? ఈ రాత్రికే తప్పకుండా వెళ్ళిపోవాలా?' అడిగాడు సౌభాగ్యరావు, భాస్కరాన్ని.

'సారీ బ్రదర్. ఇవాళ రాత్రి ఇక్కడే ఆగిపోతే మా షెడ్యూల్ అంతా అప్‌సెట్ అవుతుంది. రాత్రికి ఉండిపోయి నిద్రపోవడం తప్ప చేసేదేమీలేదు. మరోసారి వస్తాను మళ్ళీ' అన్నాడు భాస్కరం.

ట్రైన్ టైమ్ అవగానే సౌభాగ్యరావు చెప్పులు తొడుక్కుని రోడ్డు మీదకి వెళ్ళి, రిక్షాని తీసుకు వచ్చాడు.

'మీ బాబుని తీసుకు రాలేదేం? అడిగాడు సౌభాగ్యరావు

'వాడుంటే చిరాకు. వేళకి పాలుకూడా దొరకవు. బంధువుల ఇంట్లో వదలి వచ్చాము.'

"యాత్రలు ముగించుకుని తిరిగి వెళ్ళేటప్పుడు మళ్ళీ దిగాలి ఈ ఊళ్ళో, చూడవలసినవి ఏమీ లేక [illegible] ఆంధ్రదేశం వెళితే మళ్ళీ ఈ రాష్ట్రానికి ఎప్పుడు వస్తావో?"

'తప్పకుండా దిగడానికి ప్రయత్నం చేస్తాను' హామీ ఇచ్చాడు భాస్కరం.

గుమ్మం దగ్గరే నిలబడిఉన్న గీతతో అన్నాడు భాస్కరం.

'వెరీ మెనీ థాంక్స్ ఫర్ ది హాస్పిటాలిటీ. మీకు బాగా శ్రమ గలిగించాము.'

'శ్రమేమీ లేదు', అన్నది గీత నేలవంక చూస్తూ.

'మీరు తప్పకుండా రావాలి మా ఇంటికి, అటు వైపు వచ్చినప్పుడు' ఆహ్వానించింది భాస్కరం భార్య గీతని.

'అలాగే'

సౌభాగ్యరావు చెయ్యి ఆప్యాయంగా నొక్కి అన్నాడు భాస్కరం.

"పోయిట్టువరం"

"గుడ్. అరవం నేర్చేసుకున్నావన్నమాట, పది గంటల్లోనే. నవ్వాడు సౌభాగ్యరావు.

రిక్షా ఎక్కి భార్యపక్కన కూర్చున్నాడు భాస్కరం.

'ఉత్తరం వ్రాయడం మరచిపోకు' అన్నాడు.

"వెళ్ళి వస్తాం అంది" భాస్కరం భార్య

'మంచిది తిరిగి వచ్చేటప్పుడు భాస్కరాన్ని మళ్ళీ ఇక్కడికి తీసుకవచ్చే బాధ్యతమీది' అన్నాడు సౌభాగ్యరావు.

రిక్షా కదిలిన తరవాత అన్నాడు సౌభాగ్యరావు వెనకాల గుమ్మందగ్గర నిలబడిఉన్న గీతకి విన బడేలా.

'అదృష్టవంతుడు' అవసరయ్యాడు. వెయ్యి రూపాయల దాకా వస్తుంది జీతం'

నందు మలుపు తిరుగుతున్నప్పుడు చూశాడు భాస్కరం గుమ్మందగ్గర తలవంచుకుని ఆలోచిస్తు న్నట్టుగా నిలబడిఉన్న గీతని రోడ్డుమీద నిలబడి చెయ్యి ఊపుతున్న సౌభాగ్యరావుని.

'పాపం గీత!'

భాస్కరం భార్య చిన్నగా నిట్టూర్చి అన్నది.

"ఏం. పాపం గీత దేనికి?" అడిగాడు భాస్కరం.

'నన్ను తప్పకుని తిరుగుతూంటే సిగ్గు అనుకున్నాను, సిగ్గు కాదు గీతకి'

'దానికి — పాపం గీతకి - సంబంధం ఏమిటి?' ప్రశ్నించాడు భాస్కరం రిక్షాలోంచి బయటకిచూస్తూ

'బోద!'

'ఎవరికి?'

చురుగ్గా చూశాడు భాస్కరం భార్యవంక.

"గీతకి"

'మై గుడ్‌నెస్. నిజంగా?'

"అవును, నిజంగానే, కుడికాలికి బాగావుంది."

"పాపం!"

"ఇందాక కూర్చుని కూరలు తరుగుతూంటే చూశాను. సిగ్గనుకొని పొరవడ్డానుగానీ, సిగ్గుకాదు. నేనుచూడకుండా తప్పించుకొని తిరగడానికి ప్రయత్నించింది. అయినా ఆ బోదకాలుదాన్ని ఎలా చేసుకున్నాడో సౌభాగ్యరావు" అన్నది భాస్కరంభార్య.

'ఏమో పెళ్ళయిన తర్వాతవచ్చి ఉండవచ్చు. లేదా ఆ సంగతి దాచిపెట్టి ఉండొచ్చు'

రిక్షావాడు గబగబా తొక్కుతున్నాడు రిక్షాని.

కాసేపాగి అన్నాడు భాస్కరం.

"తిరిగి వచ్చేటప్పుడు, మళ్ళీ దిగేందుకు వీలుండదు"

భాస్కరం మొహంలో చిన్న చిరునవ్వు తళుక్కు మనడం, గమనించింది భాస్కరం భార్య.

కానీ — ఎందుకో ... అర్థంకాలేదు భాస్కరం భార్యకి.